ఇఫ్తార్ విందులో పాల్గొన్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటాం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

హుజూరాబాద్ టౌన్, మార్చి 29: కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్సేనని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు రూ. 4లక్షల విలువ గల ప్రమాద బీమా చెక్కులను శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలను కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్లు గందె రాధికాశ్రీనివాస్, తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, బీఆర్ఎస్ హుజూరాబాద్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, సమ్రిన్ ఖాతుం, నాగపురి శారద, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు

హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆస్తిపన్నుల వసూళ్లలో రాష్ట్రంలో అగ్రగామిగా నిలవడంతో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో పాటు మిగతా అధికారులను, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు గందే శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, జవాన్లు సుధీర్, రాజు, కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరు

హుజూరాబాద్ పట్టణంలోని సాయి రూప గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలందరికీ ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు, తహసీల్దార్ కనకయ్య, డిప్యూటీ తహసీల్దార్ నవాజ్, ఆర్ఐలు రంజిత్ రెడ్డి, శేఖర్, మసీద్ ఈద్గా కబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏపై కలెక్టర్ నజర్!

- యంత్రాంగం పనితీరుపై అసంతృప్తి
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం?
- వాట్సాప్ గ్రూప్‌ల్లో నంబర్ చేర్పించుకున్న వైనం

డీఆర్‌డీఏ ద్వారా జరుగుతున్న పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ (ఫైల్)

కలెక్టరేట్, మార్చి 29 : జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖపై కలెక్టర్ నజర్ పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఆశాఖ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఇటీవల కాలంలో వస్తున్న విమర్శలతో పాటు అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్వయంగా కలెక్టరే రంగంలోకి దిగినట్లు తెలుస్తున్నది. ఇటీవల కలెక్టర్ తీసుకున్న చర్యలు దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయన్న చర్చ ప్రస్తుతం ఆ శాఖలో జోరుగా నడుస్తున్నది.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఈ శాఖలో గత కొద్దినెలలుగా నిర్లక్ష్యం రాజ్యమేలుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలి కాలంలో ఆశాఖ యంత్రాంగం కార్యక్రమాల అమలుపై పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీలో రోజురోజుకూ వెనుకబడుతున్న నేపథ్యంలో డీఆర్‌డీఏ పనితీరుపై శుక్రవారం ఆసంస్థ కార్యాలయమైనా స్వశక్తి కళాశాలలో సంబంధిత జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలకు అందించే రుణాలు, బీమా సౌకర్యాలతో పాటు పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు కుట్టేందుకు ప్రణాళిక రూపకల్పన, పెన్షన్లపై సంబంధిత అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించడం లేదని గుర్తించిన కలెక్టర్.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా ఆ శాఖ సిబ్బంది ఇచ్చిన సమాచారం ద్వారా తెలుస్తున్నది. ఈ శాఖ ఆధ్వర్యంలో ప్రతి రోజు చేపడుతున్న కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమాచారమివ్వాల్సి ఉండగా, ఎలాంటి నివేదికలు పంపడం లేదని మండిపడిన కలెక్టర్.. ఆశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న టీ సెర్ప్ వాట్సాప్ గ్రూప్‌తో పాటు ఉపాధి హామీ సిబ్బంది వాట్సాప్ గ్రూప్‌లో తన నంబర్ చేర్పించినట్లుగా అత్యంత విశ్వసనీయ సమాచారం. అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయడంలో కూడా పట్టింపులేనట్లు వ్యవహరిస్తుండడాన్ని గుర్తించి సంబంధిత అధికారులను తీవ్రంగా మందలించడంతో పాటు.. పని తీరుమారు మార్చుకోక పోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లుగా తెలుస్తున్నది. ఓల్డేజ్, స్పౌజ్ పెన్షన్‌లపై ప్రత్యేకంగా ఆరా తీయగా, 950 స్పౌజ్ పెన్షన్లు పెండింగ్‌లో ఉండడాన్ని గమనించిన కలెక్టర్.. నివ్వెరపోవడంతో పాటు.. మహిళా సంఘాల్లోని సభ్యులకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద పెన్షన్ మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులు కూడా నామమాత్రంగానే ఉండడంతో, అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తున్నది. బ్యాంకు లింకేజీల్లో గత ఎనిమిదేళ్ల నుంచి వరుసగా మొదటి అయిదు స్థానాల్లో ఉన్న జిల్లా... ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రం రోజు రోజుకూ దిగువకు పడిపోతున్న తీరుపై సంబంధిత అధికారులను ప్రశ్నించడంతో వారు మిన్నకుండిపోగా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు చెల్లించాల్సిన కమీషన్ కూడా పెండింగ్‌లో ఉండగా, బ్యాంకు లింకేజీలో లక్ష్యం దాటినందుకు సెర్ప్ నుంచి అవార్డు అందుకున్న సందర్భంలో కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడం పట్ల సంబంధిత అధికారులపై మండిపడ్డట్లు తెలుస్తున్నది. సంక్షేమ పథకాల అమలుకు గుండె కాయ అయిన ఈ సంస్థలోని అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయలేమితోనే ఇదంతా జరుగుతున్నదని, ఈసారి ఐకేపీకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెంచుతుండగా, ఇలాగే వ్యవహరిస్తే వాటి నిర్వహణపై కూడా ప్రభావం పడుతుందని, నిర్లక్ష్యపు జాడ్యం విడనాడితేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా క్షేత్రస్థాయికి వెళ్తాయని హితబోధ చేసినట్లు భోగట్టా. మరోసారి పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తున్నది. దీంతో, కలెక్టర్ దృష్టి సారించడంతో ఇకనుంచైనా ఆశాఖలో కొంతమంది అధికారులు చేస్తున్న పెత్తనానికి చెక్ పడి, గాడిలో పడుతుందేమోననే అభిప్రాయాలు గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందిలో వ్యక్తమవుతున్నాయి.

మళ్లా నువ్వే గెలుస్తవ్ బిడ్డా..

వేగురుపల్లిలో రసమయి బాలకిషన్‌తో ముచ్చటిస్తున్న మహిళలు

పది సంవత్సరాల పాటు రాజకీయాలకు అతీతంగా సేవలందించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ శనివారం మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. బాధిత కుటుంబాలు, అనారోగ్యం పాలైన వారిని పరామర్శించేందుకు వచ్చిన ఆయనను, వేగురుపల్లిలో కనుకుంట్ల నర్సవ్వ, మామిడి లింగమ్మతో పాటు మామిడి రాజమణి చూసి మురిసిపోయారు. ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో 'నువ్వు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎట్లుండే బిడ్డా.. మళ్లా నువ్వే గెలువాలే బిడ్డా.. గెలుస్తావ్ పోబిడ్డా'.. అంటూ అవ్వలు, అక్కలు ఆశీర్వదించారు.

-మానకొండూర్ రూరల్, మార్చి 29

సబ్సిడీ విడుదలపై గ్రానైట్ ఇండస్ట్రీ అసోసియేషన్ హర్షం

సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు

సమావేశంలో మాట్లాడుతున్న గ్రానైట్ ఇండస్ట్రీ అసోసియేషన్ బాధ్యులు

కొత్తపల్లి, మార్చి 29: గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చి సబ్సిడీ విడుదలకు జీవో విడుదల చేయడంపై కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీ అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. వెంటిలేటర్‌పై ఉన్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకొనేందుకు సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం కమాన్‌పూర్ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జువ్వాడి ప్రణీత్‌రావు, షేక్ మునీర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బకాయిలను విడుదల చేస్తూ ఈనెల 28న జీవో నం 11 జారీ చేసిందని, ఈ జీవోతో పరిశ్రమల నిర్వాహకులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే సబ్సిడీ బకాయిలు సుమారు రూ 100 కోట్ల వరకు ఉన్నాయని, ఈ మొత్తాన్ని ఎలాంటి పైరవీలకు తావు లేకుండా నీరియల్ పద్ధతిలో పరిశ్రమల యజమానులకు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం సంతోషంగా ఉందన్నారు. గ్రానైట్ పరిశ్రమల నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఇటీవల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలువగా ఆయన వెంటనే స్పందించి సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారంకు ముందుకు సబ్సిడీని విడుదల చేయించడం జరిగిందన్నారు. అలాగే స్లాబ్ సిస్టంలో రాయితీ గతంలో ఒక్కొక్క కట్టర్‌కు రూ 23,360 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా గ్రానైట్ పరిశ్రమల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ 16వేలకు తగ్గించిందని, దీనితో ఒక్క కరీంనగర్‌లోనే 2వేల కట్టర్ మిషన్‌ల యజమానులపై భారం తప్పినట్లు అయిందన్నారు. అలాగే ప్రభుత్వానికి కృతజ్ఞతగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లిస్తూ సహకరిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో కోశాధికారి రాచకొండ నరేన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

మానకొండూర్ రూరల్, మార్చి 29: మానకొండూర్ పీహెచ్‌సీ పరిధిలోని చెంజర్ల సబ్ సెంటర్‌లో శనివారం డాక్టర్ మహ్మద్ సల్మాన్ ఆధ్వర్యంలో చేపట్టిన వ్యాక్సినేషన్‌ను డీఐవో డాక్టర్ సాజిదా పరిశీలించారు. రికార్డులను సైతం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సుఖద, సీహెచ్‌వో రాజూనాయక్, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, తదితరులు ఉన్నారు.

మట్టి రవాణాపై అధికారుల ఆరా

'నమస్తే' కథనానికి స్పందన

మానకొండూర్ రూరల్, మార్చి 29: నేషనల్ హైవే పనుల పేరిట అక్రమార్కులు మట్టిని బస్టాండ్ ఆవరణలో నిల్వ చేసి పక్కదారి పట్టిస్తుండడంపై నమస్తే తెలంగాణలో శనివారం 'బస్టాండ్ ఆవరణలోనే మట్టి డంపింగ్-షిఫ్టింగ్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం ఆర్టీసీ కంట్రోలర్ పడాల రవీందర్ గౌడ్‌తో పాటు కానిస్టేబుల్స్ బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. మండల అధికారులను సైతం కలిసి 'డంపింగ్-షిఫ్టింగ్'కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలను పైఅధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 29: స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా అమలు చేయనున్న రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన మైనార్టీ యువత దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖాధికారి బి.పవన్‌కుమార్ తెలిపారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 55 ఏళ్లలోపు, వ్యవసాయానుబంధ రంగాలకు 21 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఏప్రిల్ 5లోగా http:\\tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లో దఖాస్తు చేసుకోవాలని శనివారం ఓ ప్రకటనలో సూచించారు.

సుందరగిరి వారసంత వేలం

చిగురుమామిడి, మార్చి 29: సుందరగిరి గ్రామంలో గొర్రెలు, మేకల వారసంత వేలం జీపీ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరకాలకు చెందిన పోరండ్ల రమేశ్ రూ.7 లక్షలకు వేలంపాడి కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీ మూర్తి రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

మానకొండూర్, మార్చి 29 ఏప్రిల్ 2 నుంచి 6 వరకు తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో జరిగే సీపీఎం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ పిలుపునిచ్చారు. శనివారం మానకొండూర్ మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి భద్రయ్య, నాయకులు గట్టు సతీశ్, కిశోర్, నాగిరెడ్డి, చిరంజీవి, గంగన్న, కొమురయ్య పాల్గొన్నారు

నెలాఖరు దాకా సాగునీటిని విడుదల చేయాలి

శంకరపట్నం, మార్చి 29: ఏప్రిల్ నెలాఖరు దాకా పంటలకు సాగు నీరు అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం మెట్‌పల్లి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవానికి హాజరైన తహసీల్దార్ బత్తుల భాస్కర్‌కు తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల శాఖ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మార్చి నెలాఖరు వరకు మాత్రమే కాలువ ద్వారా సాగు నీరు అందించాలని నిర్ణయించగా, ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నందున ఏప్రిల్ నెలాఖరు దాకా నీటి విడుదలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు అంతడ్పుల సతీశ్, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

పోలీసుల అదుపులో అంతరాష్ట్ర సైబర్ నిందితుడు

కరీంనగర్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తితో పెట్టుబడి పెట్టించి మోసం చేసిన అంతరాష్ట్ర సైబర్ నిందితుడిని కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ నగరానికి చెందిన ఓ వ్యక్తి సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రాంలో వచ్చిన ఓ ప్రకటన పట్ల ఆకర్షితుడై గతేడాది జూలై నుంచి పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. ఈ క్రమంలో మొదటగా రూ. వెయ్యి పెట్టుబడి పెట్టగా రూ. 2 వేల వరకు లాభం వచ్చింది. ఈ క్రమంలో లోన్ సైతం తీసుకొని దాదాపు రూ. 40.90 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత తాను మోసపోయానని గుర్తించి 2024 ఆగస్టులో సైబర్ క్రైం హెల్ప్‌లైన్ సెంటర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డీఎస్పీ నర్సింహారెడ్డి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడి డబ్బులను సైబర్ నేరస్తులు గుజరాత్‌కు సంబంధించిన బ్యాంక్ అకౌంట్లలో ట్రాన్స్‌ఫర్ చేశారని గుర్తించారు. సైబర్ క్రైం డీఎస్పీ నరసింహారెడ్డి తన సిబ్బందితో గుజరాత్‌లోని సూరత్ జిల్లాకు వెళ్లి అక్కడ ఉన్న నితిన్ దేవచంద్ భాయ్ గజేరాని ఈ నెల 27న పట్టుకున్నారు. సూరత్ జిల్లా కోర్టు అనుమతితో అక్కడి నుంచి ట్రాన్సిస్ట్ వారెంట్‌పై శనివారం కరీంనగర్ కోర్టులో హాజరు పరిచి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడికి సహకరించిన వ్యక్తులను గుర్తించి త్వరలో వారిని కూడా పట్టుకుంటామని డీఎస్పీ నరసింహారెడ్డి తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ నరసింహారెడ్డి, ఆర్ఎస్ఐ దినేష్, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సిబ్బంది వసీం అక్రమ్, రాజేందర్, కేశవ్, అరుణ్‌ను తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికాగోయల్ అభినందించారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

తెలంగాణచౌక్, మార్చి 29: ఉగాది, రంజాన్ పండుల సందర్భంగా వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవులు రావడంతో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ప్రయాణికుల రద్దీ నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు సొంత ఊర్లకు బయలుదేరారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు శనివారం 80 ప్రత్యేక బస్సులను నడిపించారు. జిల్లా కేంద్రం నుంచి గోదావరిఖని, మంచిర్యాల, జగిత్యాల, మెట్‌పల్లి, వరంగల్ రూట్లలో రద్దీ ఎక్కువగా కనిపించింది. సీట్ల కోసం ప్రయాణికుల బస్సుల వెంటపరుగులు తీశారు. మంథని, చొప్పదండి, జమ్మికుంట వెళ్లే ప్రయాణికులు సమయానికి బస్సులు రాకపోడంతో బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూశారు. ఏటీఎం సురేశ్ రద్దీకనుగుణంగా బస్సులను ఏర్పాటు చేశారు.

ఉపాధి పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

తెలంగాణచౌక్, మార్చి 29: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయం కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లి సొమ్మసిల్లి పడిపోయి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న కూలీని ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ, కూలీలకు పని ప్రదేశాల్లో మంచినీటి వసతి, టెంట్ ఏర్పాటు చేయడంతో పాటు డిహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. కూలీని పరామర్శించిన వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు యుగేంధర్, రాజయ్య, శ్రీనివాస్, మల్లేశం ఉన్నారు.

విజన్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే సంబురాలు

పట్టాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, మార్చి 29 : రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం పీపీ2(యూకేజీ) పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. విద్యార్థులందరికీ కిండర్ గ్రాడ్యుయేషన్ పట్టాలను వారి తల్లిదండ్రులతో కలిపి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు అందరినీ ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మల్లయ్య, వెంకట్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా 'అల్ఫోర్స్ జీనియస్' వార్షికోత్సవం

హుజూరాబాద్ టౌన్, మార్చి 29: అల్ఫోర్స్ జీనియస్ పాఠశాల వార్షికోత్సవం 'ఆనందోత్సవ్' పేరిట శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి

కలెక్టరేట్, మార్చి 29 : దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, తెలంగాణ ఉపాధి కూలీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వాసుదేవ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో మాట్లాడుతూ, బ్యాంకు ఖాతాలు, ఆధార్ అనుసంధానం పేరిట జిల్లాలో వందల మంది కూలీల జాబ్‌కార్డులు తొలగించడం అన్యాయమన్నారు. కూలీల వేతనం రూ.600కు పెంచాలని, ఎండాకాలంలో అందించే వేసవి భత్యం విడుదల చేయాలని, పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఆవునూరి ఎల్లయ్య, చెప్యాల మల్లయ్య, సాయిని రాజేశ్వర్, కొంకట రవి, మాడుగుల గోపాల్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

రామడుగు, మార్చి29 : రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 3న నిర్వహించనున్న స్వామివారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందించి వీర్లను ఆహ్వానించారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రయాణం.. ఓ పరీక్షే

వీణవంకలో పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థినులు

వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయడానికి వెళ్లే కేజీబీవీ విద్యార్థినులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు. విద్యాలయం నుంచి పరీక్ష కేంద్రానికి కేవలం ఒకే ఆటోను ఏర్పాటు చేయడంతో పరిమితికి మించి సుమారు 16 మంది విద్యార్థినులు కిక్కిరిసి వెళ్తున్నారు. నిత్యం లారీలు, ట్రాక్టర్‌లు, తదితర వాహనాలు వెళ్లే మార్గంలో విద్యార్థులు ఇలాంటి ప్రయాణం చేయడం సరైన పద్ధతికాదని, పరీక్షల సమయంలో ఎన్నో ఘటనలు జరుగుతున్నా పాఠశాల అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని అటు తల్లిదండ్రులు, ఇటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-వీణవంక, మార్చి 29

లారెక్కిన ఇల్లు!

లారీలో తీసుకువెళ్తున్న కంటైనర్

గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా మీదుగా శనివారం జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు లారీలో తరలిస్తున్న ప్రత్యేక కంటైనర్‌ను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఇంటిగా తీర్చిదిద్దిన ప్రత్యేక కంటైనర్‌ను ఆశ్చర్యంగా చూసిన గ్రామస్తులు.. ఇల్లు లారెక్కిందని మాట్లాడుకోవడం కనిపించింది.

-గంగాధర, మార్చి 29

తోటి ఉద్యోగులను మోసగించిన కేసులో ఎస్ఎల్‌పై వేటు

ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చిన కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ

ముకరంపుర, మార్చి 29: తోటి ఉద్యోగులను మోసం చేసిన సైదాపూర్ సెక్షన్ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ తిరుపతి రెడ్డి వ్యవహారాన్ని ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ